గంగపుత్ర సంఘం నూతన కమిటీ ఎన్నిక

బెల్లంపల్లి, అక్టోబర్ 27 : బెల్లంపల్లి పట్టణ గంగపుత్ర సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం పట్టణంలోని తిలక్ స్టేడియంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో అధ్యక్షుడిగా వంగళ చక్రపాణి, కార్యదర్శులుగా మాదరబోయిన మల్లేశ్, దామెర విజయ్‌కుమార్‌ను నియమించారు. ఎన్నికల కమిటీ చైర్మన్ దామెర సదానందం, సంఘం మంచిర్యాల జిల్లా ఉపాధ్యక్షుడు డోలి సుధాకర్, చీఫ్ అడ్వైజర్ బాషబోయిన పోతరాజు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికైన కమిటీ నాయకులు మాట్లాడుతూ, పట్టణ గంగపుత్ర సంఘం బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఇక్కడ గంగపుత్ర సంఘం సభ్యులున్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను బలపరుస్తున్న కాంగ్రెస్

బెల్లంపల్లి, అక్టోబర్ 27 : కేంద్రంలోని బీజేపీ చేసిన తప్పుడు చట్టాలు, ప్రజా వ్యతిరేక విధానాలను రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బలపరుస్తోందని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి సబ్బ ని కృష్ణ ఆరోపించారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో పార్టీ వ్యవస్థాపకుడు మద్దికాయల ఓంకార్ 16వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన స్మారకార్థం, చిత్రపటం వద్ద పూలమాల వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఆర్ఎస్ఎస్ భావజాలంతో మూడోసారి కేంద్రాన్ని పాలిస్తున్న బీజేపీ తన మత భావ జాలాన్ని పెంపొందించుకుంటోందని విమర్శించారు. సెక్యులర్ ముసుగులో ఉన్న కాంగ్రెస్ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని నాయకులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పసులేటి వెంకటేశ్, ఆరెపల్లి రమేశ్, సతీశ్, కాంపల్లి రాధ, దుర్గం లక్ష్మి, కామెర పద్మ, నరేశ్, శేఖర్, సాయిరాం, మహేశ్, ఆకాశ్, అరుణ్ పాల్గొన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ సెమిస్టర్ పరీక్ష

కాగజ్‌నగర్, అక్టోబర్ 27: కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం సెమిస్టర్–2 పరీక్షలు ఈనెల 28 నుంచి జరుగనున్నట్లు ప్రిన్సిపల్ శ్రీదేవి, కోఆర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు తమ వెంట ఒరిజినల్ ఆధార్ కార్డు, ఏదైనా గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని, సెల్ ఫోన్, ఇతర ఎలాంటి పరికరాలు పరీక్ష హాలులో అనుమతించమని స్పష్టం చేశారు.

రెగ్యులరైజ్ చేయాలి

ఆసిఫాబాద్ టౌన్, అక్టోబర్ 27: ఎన్‌హెచ్ఎం కింద పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలను రెగ్యులరైజ్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ అధ్యక్షతన ఎంఎల్ హెచ్‌పీ యూనియన్ సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎంఎల్‌హెచ్‌పీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఖాళీలను భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు గణేశ్, రాందాస్, ప్రశాంత్, సారిక, కీర్తన, తిరుమల, సుచరిత, ప్రశాంత్, విజయ సాగర్ తదితరులున్నారు. కాగా, జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ తెలిపారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా బోగే ఉపేందర్, జిల్లా అధ్యక్షుడిగా గణేశ్, ఉపాధ్యక్షులుగా కీర్తన, ప్రశాంత్, విజయ్ సాగర్, ప్రధాన కార్యదర్శిగా సారిక, జాయింట్ సెక్రటరీలుగా రాందాస్, ప్రకాశ్, కోశాధికారిగా శ్రేష్మను ఎన్నుకున్నట్లు తెలిపారు.

బాల్క సుమన్ అరెస్టు అప్రజాస్వామికం

చెన్నూర్, అక్టోబర్ 27: హైదరాబాద్‌లో బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పోలీసులు అకారణంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి, మున్సిపాలిటీ కౌన్సిలర్ రేవెల్లి మహేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అకారణంగా అప్రజాస్వామికంగా బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

ఆర్థిక సాయం

తాండూర్, అక్టోబర్ 27 : అచ్చలాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన ఎస్జీఎఫ్ అండర్–17 మంచిర్యాల జిల్లా బాలికల కబడ్డీ ఎంపిక పోటీల్లో జోనల్ స్థాయికి ఎంపికైన విద్యార్థినులకు క్రీడాదుస్తుల కోసం జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రవీందర్ రెడ్డి రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయనను పలువురు అభినందించారు.

ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియపరచటం ఏమనగా శ్రీ కొండ లక్ష్మిరాజం S/o. బ్రహ్మయ్య , వయస్సు: 53 సం||లు వృత్తి బిజినెస్, నివాసం: H.No. 15–94, సంగమల్లయ్యపల్లె, హనుమాన్ టెంపుల్ దగ్గర తిగలపహాడ్, మం|| మంచిర్యాల, జిల్లా:ఆదిలాబాద్, రిజిస్ట్రేషన్ జిల్లా ఆదిలాబాద్ సబ్–జిల్లా మంచిర్యాల జిల్లా మరియు జిల్లా పరిషత్ ఆదిలాబాద్ రెవెన్యూ మండలం మంచిర్యాల గ్రామ పంచాయతీ మరియు గ్రామము హాజీపూర్ కోడ్ నెం. 103 నకు చెందిన పట్టా ఇంటి నివాసం ఖాళీస్థలము సర్వేనెం.14లోని ప్లాటు నెం.48 యొక్క విస్తీర్ణం 266.66 చదరపు గజములు. ఇది 222.95 చదరపు మీటర్లకు సమానము అగును సదరు దస్తావేజు వెంట నక్షా జతపరచడమైనది. ఈ తీరుగా కలిగిన ప్లాటును మీకు విక్రయించి మీ స్వాధీన పరచడమైనది. దీనికి హద్దులు: తూర్పు: ప్లాటు నెం. 52, పడమర: 33 ఫీట్ల రోడ్డు, ఉత్తరం: ప్లాటు నెం. 49, దక్షిణం: ప్లాటు నెం. 47, లో గల యజమాని అయి ఉండి సంపూర్ణ స్వాధీనములో ఉండి నాక్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ Ltd. బ్రాంచి గోదావరిఖని వారి వద్ద తనఖా పెట్టుచున్నారు. కావున ఎవరైయినా ఎలాంటి హక్కులు కానీ ఆక్షేపనలు కానీ ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన (5) రోజులలోపల ఈ క్రింది చిరునామాకు తెలియజేయగలరు.

ఇట్లు: Sd/- పిన్నింటి అశోక్, అడ్వకేట్, ఇ.నెం.3-7-852/1.వావిలాలపల్లి,కరీంనగర్ సెల్: 9849331558

విద్యార్థులకు వరం.. ఐటీఐ కోర్సులు

మందమర్రిలో ప్రభుత్వ ఐటీఐ కళాశాల

మందమర్రి రూరల్, అక్టోబర్ 27 : మంచిర్యాల జిల్లాలో ఐటీఐ కోర్సుల ద్వారా పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. తద్వారా ఉపాధి, ఉద్యోగావకాశాలకు మార్గం సుగమం అవుతున్నది. ఇదే ఉద్దేశంతో ప్రభుత్వం పారిశ్రామిక శిక్షణ సంస్థ ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్లను ఏర్పాటు చేసింది. ఇది విద్యార్థుల పాలిట వరమవుతోంది. ఐటీఐ కోర్సు పూర్తి కాగానే అప్రెంటీస్ చేసి, ప్రతిభతో అవకాశాలు దక్కించుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ ఐటీఐలో కార్పొరేట్ కంపెనీలు, ప్రభుత్వ భాగస్వామ్యంతో ఆరు నూతన కోర్సులు మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేటిక్(40) ఏడాది, ఇండస్ట్రియల్ రొబోటిక్, డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్(40)ఏడాది, ఆర్టిసన్ యూజింగ్ అడ్వాన్స్ టూల్(20) ఏడాది, బేసిక్ డిజైనర్ వర్చువల్ వెరిఫైయర్ మెకానిక్(24) రెండు సంవత్సరాలు, అడ్వాన్స్ సీఎన్‌సీ మెషినింగ్ టెక్నీషియన్(24) రెండు సంవత్సరాలు, మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికిల్ (24) రెండు సంవత్సరాలు గా ప్రవేశపెట్టి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

మందమర్రి ఐటీఐలో మాత్రమే

మంచిర్యాల జిల్లాలో మందమర్రి, నస్పూర్, మంచిర్యాల, జన్నారంలో ప్రభుత్వ ఐటీఐలు ఉండగా మందమర్రి ప్రభుత్వ ఐటీఐలో మాత్రమే నూతన కోర్సులను ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం టాటా కార్పొరేట్ కంపెనీలు ముందుకు వచ్చాయి. సింగరేణి ప్రాంతం కావడం యువతలో ఆసక్తి ఉండడంతో మొగ్గు చూపారు.

అర్హులు దరఖాస్తు చేసుకోండి

మందమర్రి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో టాటా కంపెనీ సౌజన్యంతో ఆరు అడ్వాన్స్ టెక్నాలజీ కోర్సుల ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతోంది. అర్హులైన అభ్యర్థులు 30వ తేదీలోగా https: iti.telangana.gov.in వెబ్‌సైట్లో దరఖాస్తు చేసుకోవాలి. వివరాలకు 9154549697,9885981959 నంబర్లను సంప్రదించాలి.

-దేవానంద్, ఐటీఐ ప్రిన్సిపాల్, మందమర్రి.

జిల్లాస్థాయి ఉషా ఎంపిక పోటీలు

జోనల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సీసీసీ నస్పూర్, అక్టోబర్ 27: నస్పూర్‌లోని సీసీసీ ఆదిత్య పాఠశాలలో ఆదివారం మంచిర్యాల జిల్లా స్కూల్‌గేమ్స్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఉషా అండర్–17, అండర్–19 ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను జోనల్ పోటీలకు ఎంపిక చేశారు. బాలబాలికల అండర్–17 విభాగంలో సాయిప్రసన్న, హర్షిత, మన్విత, వైశాలి, యోగిత, కార్తికేయ, వంశీకృష్ణ, శ్రీనిత్, చరణ్, సర్జన్‌తేజ్, అండర్–19 విభాగంలో హాసిని, రుషికేశ్, అంజి జోనల్ పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గోపతి సత్తయ్య, ఎస్జీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఫణిరాజా, ఆదిత్య పాఠశాల కోచ్, ఉషా ఆర్గనైజర్ మాటూరి శివమహేశ్, కోచ్‌లు వెంకటేశ్, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు

మహంకాళి దేవస్థానంలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

రెబ్బెన, అక్టోబర్ 27: ఇందిరానగర్‌లో ప్రసిద్ధి గాంచిన శ్రీ కనకదుర్గాదేవి స్వయంభూ మహంకాళి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పట్టువస్త్రాలు, ఒడి బియ్యం, నైవేద్యాలు సమర్పించడంతోపాటు పలువురు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తాండూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కుమారస్వామి దంపతులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకోగా, ఆలయ ప్రధానార్చకుడు దేవర వినోద్‌స్వామి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి అన్నదానం ఏర్పాటు చేశారు.

కుమ్రం భీం వర్ధంతి

విర్దండిలో కుమ్రం భీం విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆదివాసీ నాయకులు

కౌటాల, అక్టోబర్ 27 : ఆదివాసీ హక్కుల పోరాటవీరుడు కుమ్రం భీం వర్ధంతిని మండలంలోని విర్దండి గ్రామంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమ్రం మాంతయ్య మాట్లాడుతూ, జల్ జంగల్ జమీన్ కోసం పోరాడిన విప్లవ యోధుడు భీం అన్నారు. ఆదివాసీ హక్కుల సాధన కోసం మనమంతా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్సీ దండే విఠల్ భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విశ్వనాథ్, మాజీ సర్పంచ్ రేణుక, మాజీ ఉపసర్పంచ్ బండు, పోచాని, గ్రామస్తులు మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులున్నారు.

సేంద్రియ వ్యవసాయంపై దృష్టిసారించాలి

సీసీసీ నస్పూర్, అక్టోబర్ 27: కేవీకే బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో సహకారంతో హాజీపూర్ ఎఫ్‌పీసీ ఆధ్వర్యంలో నస్పూర్‌లోని సీతారాంపల్లిలో సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించారు. సేంద్రియ వ్యవసాయం చేయడానికి గ్రామ రైతులు ముందుకు రావడం సంతోషదాయకమని డాక్టర్ శ్యాంసుందర్ రెడ్డి, ఎఫ్‌పీసీ అడ్వైజర్ గోనె శ్యాంసుందర్‌రావు అన్నారు. గ్రామానికి చెందిన జాడి తిరుపతి భూమిని సేంద్రియ వ్యవసాయ క్షేత్రంగా తయారు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎఫ్‌పీసీ డైరెక్టర్ బొడ్డు శంకరయ్య, బొలిశెట్టి తిరుపతి, రైతులు రాచకొండ చందన, జాడి తిరుపతి, జాడి రూప, రావుల సాయిలత, జాడి నాగమణి, ధర్నికమల, సల్లూరి తిరుపతి, కటుకూరి తిరుపతి, రాచమల్లు సత్యనారాయణ, రావుల లింగయ్య, ఆకుల నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

లారీ అసోసియేషన్ సమస్యలు పరిష్కరించాలి

- లేకపోతే రాష్ట్ర వ్యాప్త బంద్ పిలుపునిస్తాం
- లారీ ఓనర్స్, డ్రైవర్స్ తెలంగాణ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి

మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి

కాగజ్‌నగర్, అక్టోబర్ 27 : కుమ్రం భీం జిల్లాలోని కాగజ్‌నగర్ లారీ ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ డిమాండ్లు, సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా బంద్‌కు పిలుపునిస్తామని లారీ ఓనర్స్, డ్రైవర్స్ తెలంగాణ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి హెచ్చరించారు. కాగజ్‌నగర్ పట్టణంలో కొనసాగుతున్న లారీ అసోసియేషన్ నిరసనకు ఆయన మద్దతు తెలిపి, వివరాలు తెలుసుకొని మాట్లాడారు. జేకే పేపర్ మిల్లు యాజమాన్యం లారీ అసోసియేషన్ ప్రతినిధులతో చర్చలు జరిపి సమస్యలు, డిమాండ్లు పరిష్కరించాలన్నారు. లేకపోతే ముందస్తు కార్యాచరణ రూపొందించి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా లారీలు బంద్ నిర్వహించి, రోడ్లు దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకుండా నెల రోజులకు పైగా కాలయాపన చేయడం సరికాదన్నారు. లారీ అసోసియేషన్ సమ్మె కారణంగా చాలా మంది కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, జేకే యాజమాన్యం స్పందించి డిమాండ్లు పరిష్కరించాలన్నారు. సమస్య పరిష్కరించకుంటే ముఖ్యమంత్రి, రవాణా శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో లారీ ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్బర్, రాష్ట్ర సెక్రెటరీ చాంద్‌పాషా, కాగజ్‌నగర్ అధ్యక్షుడు వెన్న కిశోర్ బాబు, సెక్రెటరీ మాజిద్, రాష్ట్ర, ఉమ్మడి ఆదిలాబాద్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఒకటే డీఏపై ఉద్యోగుల్లో అసంతృప్తి

- టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి

మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, అక్టోబర్ 27: ఉపాధ్యాయులకు ఐదు డీఏలు పెండింగ్‌లో ఉండగా కేవలం ఒకటే డీఏ విడుదల చేయాలనే కేబినెట్ నిర్ణయంపై ఉపాధ్యాయ, ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతికుమారి తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చిన 15 రోజుల్లో బకాయిలు చెల్లిస్తామని, పాత పెన్షన్ విధానం అమలు చేస్తామని హామీ ఇచ్చి ఒకటే డీఏ చెల్లించడం సరికాదన్నారు. మూడు డీఏలను వెంటనే విడుదల చేయాలని, అలాగే జీవో 317 బాధితులకు న్యాయం చేయాలని, పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు హేమంత్ షిండే, కోశాధికారి రమేశ్, కార్యదర్శి సుభాష్ జాదవ్, జిల్లా కమిటీ సభ్యులు, హరీశ్, అనిత, నవీన్ మండలాల బాధ్యులు సుశీల్, రవి, దీపిక, కాలేరామ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ గెస్ట్‌హౌస్ సీజ్

గెస్ట్ హౌస్‌ను సీజ్ చేస్తున్న రెవెన్యూ, పోలీస్ అధికారులు

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 27: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఎల్ఐసీ ఆఫీస్ పక్కన ఉన్న ప్రైవేట్ గెస్ట్ హౌస్‌ను మంచిర్యాల ఆర్డీవో రాములు ఆదేశాలతో రెవెన్యూ, పోలీస్ అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకొని మంచిర్యాల తహసీల్దార్ రఫతుల్ల హుస్సేన్ ఆధ్వర్యంలో సీజ్ చేశారు. ఆగస్టు 20న రాత్రి వ్యభిచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో పోలీసులు లాడ్జిపై దాడిచేసి ఏడుగురు నిందితులు, నిర్వాహకులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అయినా వ్యభిచార కార్యక్రమాలకు పాల్పడుతున్నారన్న సమాచారంతో గెస్ట్‌హౌస్‌ను స్వాధీన పరుచుకొని అధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లాల కేంద్రంలోని లాడ్జిలు, గెస్ట్ హౌస్‌లు, ఇండ్లల్లో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంచిర్యాల పట్టణ సీఐ ప్రమోద్ రావు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ ముత్తె ప్రవీణ్, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

కూచిపూడి నృత్య ప్రదర్శనలో విద్యార్థులు

సీసీసీ నస్పూర్, అక్టోబర్ 27: నస్పూర్‌లోని శార్వాణి కూచిపూడి నృత్యాలయం గురువు డాక్టర్ భార్గవిప్రేమ్ ఆధ్వర్యంలో ఆదివారం నస్పూర్‌కాలనీ అభయాంజనేయస్వామి ఆలయంలో గజ్జె పూజను ఘనంగా నిర్వహించారు. కూచిపూడి నృత్యంలో శిక్షణ పొందుతున్న 20మంది విద్యార్థులకు వేద పండితుల సమక్షంలో శాస్త్రీయ పద్ధతిలో కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. గజ్జె పూజ అనంతరం 40 మంది విద్యార్థుల కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. ఈ సందర్భంగా గురువు డాక్టర్ భార్గవిప్రేమ్ మాట్లాడుతూ, కూచిపూడిలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చి వారిని ఉన్నత స్థాయిలో నిలుపడమే తమ లక్ష్యమని అన్నారు. ఇక్కడ మంచిర్యాల జిల్లా నృత్య సంఘం అధ్యక్షుడు రాకం సంతోష్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లే'

సిర్పూర్(యు), అక్టోబర్27: రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లేనని జైనూర్ సీఐ రమేశ్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినవోత్సవాల్లో భాగంగా ఆదివారం మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుమారు 34 మంది రక్తదానం చేసినట్లు తెలిపారు. ఇలాంటి సేవ కార్యక్రమాల్లో యువకులు ముందుండాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ రామకృష్ణ, జైనూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావ్, ఆదివాసీ మిత్ర సొసైటీ అధ్యక్షుడు ఆడే వెంకటేశ్, శీతల్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు

మందమర్రి : ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మందమర్రి, అక్టోబర్ 27: రామకృష్ణాపూర్ పట్టణంలోని శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో రెండు దశాబ్దాల క్రితం పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. పాఠశాలలో 2001–02 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు పట్టణంలోని ఆర్కేసీవోఏ క్లబ్‌లో ఒకే చోట కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని మురిసిపోయారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన అనాటి గురువులను సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. రోజంతా సందడిగా గడిపారు.

కౌటాల : సెయింట్ జోసెఫ్స్ ఉన్నత పాఠశాల 2006–2007 సంవత్సరం పూర్వ విద్యార్థులు

కౌటాల, అక్టోబర్ 27 : విజయనగరం గ్రామంలోని సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలలో 2006–07 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఒక్కచోట కలిసి, అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. చిన్ననాటి అనుభూతులను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు సిస్టర్ ఆలీస్, మాదాను మారయ్య, ఇందిరాదేవి, ఎలకర్ దిలీప్, సీతారాం, సాతుకు శ్రీనివాస్, మాదాను వెరోనికతోపాటు ప్రస్తుత ఇన్‌ఫంట్ జీసస్ పాఠశాల ప్రిన్సిపాల్ ఫాదర్ టోంలున్నారు.

కమిషనర్‌గా మురళీకృష్ణ బాధ్యతల స్వీకరణ

కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన మురళీకృష్ణను సన్మానిస్తున్న అధికారులు, సిబ్బంది

చెన్నూర్, అక్టోబర్ 27: చెన్నూర్ మున్సిపాలిటీ కమిషనర్‌గా మురళీకృష్ణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్‌గా పనిచేస్తూ చెన్నూర్ మున్సిపాలిటీ కమిషనర్‌గా ఆయన బదిలీపై వచ్చారు. ఇక్కడ మున్సిపాలిటీ కమిషనర్‌గా పనిచేసిన గంగాధర్ బదిలీ కాగా, అతడిని సీడీఎంఏలో రిపోర్టులో చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన మురళీకృష్ణను అధికారులు, సిబ్బంది శాలువాతో సన్మానించారు.

బదిలీ అధికారికి సన్మానం

బదిలీపై వెళ్తున్న కమిషనర్ మురళీకృష్ణను సన్మానిస్తున్న సిబ్బంది

మందమర్రి, అక్టోబర్ 27: చెన్నూర్ మున్సిపాలిటీకి బదిలీపై వెళ్తున్న క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణను ఆదివారం కార్యాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిబ్బందితోపాటు కార్మికులు కమిషనర్ మురళీ కృష్ణను శాలువాలతో సన్మానించి పుష్పగుచ్ఛాలను అందజేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్, సూపర్‌వైజర్ వేల్పుల శ్రీనివాస్, సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

అలరించిన కవి సమ్మేళనం

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 27: జిల్లా సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం అక్టోబర్ రెండవ కవి సమ్మేళన కార్యక్రమాన్ని అధ్యక్షుడు దండనాయకుల వామన్ రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి కవయిత్రి సుమలత రాజేంద్రప్రసాద్ రచించిన మంచి భావన అనే పుస్తకాన్ని ముఖ్య అతిథులుగా హాజరైన కవులు దుర్గం రమేశ్ గౌడ్, డా.శ్రీనాథ్, పొట్టిశెట్టి సృజన పరిచయం చేశారు. ఇక్కడ గొల్లపల్లి బ్రహ్మయ్యచారి, ఘనపురం సంతోష్, భూపతి సంతోష్, గాదాసు రజిత, మోటూరి అర్పిత, సుంధాంస్, కవులు, సాహితి ప్రియులున్నారు.

క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

రెబ్బెన, అక్టోబర్ 27: గ్రామాల్లో ఉచితంగా ఏర్పాటు చేసే మెడికల్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని నవేగాం మాజీ సర్పంచ్ వడ్డై మాధవి అన్నారు. మండలంలోని నవేగాం ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించగా డాక్టర్లు లక్ష్మీప్రసాద్, సుజాత ఆధ్వర్యంలో 87మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

ప్రగతి మైదానంలో శ్రమదానం

వాకింగ్ ట్రాక్ శుభ్రం చేస్తున్న వాకర్స్

శ్రీరాంపూర్, అక్టోబర్ 27: శ్రీరాంపూర్‌లోని ప్రగతి స్టేడియంలో ఆదివారం వాకర్స్ శ్రమదానం చేశారు. గ్రౌండ్‌లోని వాకింగ్ ట్రాక్‌కు ఇరుపక్కలా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా వాకర్స్ మాట్లాడుతూ, వర్షాలతో వాకింగ్ ట్రాక్ కోతకు గురికావడంతో నడవడానికి ఇబ్బందిగా ఉందని, సింగరేణి యాజమాన్యం పట్టించుకోకపోవడంతో తాము మట్టిపోసి చదును చేశామన్నారు. అధికారులు వెంటనే స్పందించి మైదానంలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని కోరారు.

బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

రాయలింగు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు

మందమర్రి, అక్టోబర్ 27: బీఆర్ఎస్ చెన్నూర్ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ రాజా రమేశ్ తండ్రి గొడిసెల లింగయ్య ఇటీవల మరణించగా బాధిత కుటుంబ సభ్యులను మందమర్రి పట్టణానికి చెందిన బీఆర్ఎస్, టీబీజీకేఎస్, సోషల్ మీడియా వారియర్స్ పరామర్శించారు. కరీంనగర్ తీగలగుట్టపల్లిలోని గ్రీన్‌హోమ్స్‌లో గల డాక్టర్ రాజారమేశ్ ఇంటికి ఆదివారం వెళ్లిన నాయకులు రాయలింగు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ సీనియర్ నాయకుడు మద్దెల శంకర్, బీఆర్ఎస్ నాయకులు మేడిపల్లి మల్లేశ్, బెల్లం అశోక్, సీపెల్లి సాగర్, మజార్, తిరుపతి తదితరులున్నారు.

మెరుగైన విద్యుత్ సేవలందించడమే లక్ష్యం

ఎస్ఈ, డీఈ, ఏఈలను సన్మానిస్తున్న ఆస్నాద్ గ్రామ రైతులు

చెన్నూర్ రూరల్, 27: విద్యుత్ వినియోగదారులతోపాటు రైతులకు మెరుగైన విద్యుత్ సేవలందించడమే లక్ష్యమని జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రావణ్ తెలిపారు. చెన్నూర్ మండలంలోని కొమ్మెర, ఆస్నాద్ సబ్ స్టేషన్లను ఆయన సందర్శించారు. గ్రామాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు. ఆస్నాద్ సబ్‌స్టేషన్‌లో ఆయనతోపాటు డీఈ కైసర్, ఏఈ శ్రీనివాస్‌ను రైతులు సన్మానించారు. పంట పొలాలకు వచ్చే త్రీఫేస్ లైన్‌లో ఎలాంటి ఇబ్బందులు ఉన్న తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని రైతులు కోరారు. అనంతరం విద్యుత్ వాడకంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎస్ఇ రైతులకు వివరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు ముత్యాల బాపగౌడ్, ఎస్ స్వామి, ఏలేశ్వరం నరసింహచారి, లైన్‌మెన్లు తిరుపతయ్య, రమేశ్ రెడ్డి, కలగూర రాయమల్లు, రైతులు పాల్గొన్నారు.